


27 మంది యువకులు రక్తదానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో గురువారం 27 మంది యువకులు రక్తదానం చేశారని జిల్లా ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తలసేమియా చిన్నారులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో కె.జాషువా తన స్నేహితులను ప్రోత్సహించడాన్ని కృష్ణారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్ఎస్ ఆర్‌కె.వరప్రసాదరావు, డాక్టర్ జి.స్పందన, పిఆర్ఓ కెవి.రమణ, జాషువా పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు



గోదావరి వాసుల.. తాగునీటి ఘోష..!

- కొత్త ప్రభుత్వమైనా సమస్యను పరిష్కరించేనా?
- ఆక్వా చెరువులతో తాగునీటి వనరులు ధ్వంసం
- కొనుగోలు చేస్తే తప్ప తీరని దాహం
- వాటర్‌గ్రిడ్ అంటూ గత ప్రభుత్వం ఐదేళ్లు కాలక్షేపం
- గంపగుత్తగా ఓట్లేసిన గోదావరి ప్రజల గోడు వినేనా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పరవళ్లు తొక్కే గోదావరిని ఆనుకుని ఉన్నా దాహం తీర్చుకునేందుకు గుక్కెడు నీళ్ల కోసం అల్లాడుతున్న జిల్లా ప్రజల ఘోష కొత్త ప్రభుత్వానికైనా విన్పించేనా అనే చర్చ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పెద్దఎత్తున సాగుతోంది. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో టిడిపి కూటమి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 స్థానాలనూ గెలుచుకుంది. దీంతో జిల్లాలోని ప్రధానమైన తాగునీటి సమస్యను కొత్త ప్రభుత్వమైనా పరిష్కరించాలని అంతా కోరుతున్నారు. విచ్చలవిడిగా ఆక్వా చెరువుల తవ్వకాలు సాగించడంతో రెండు జిల్లాల్లోని తాగునీటి వనరులన్నీ కలుషితమయ్యాయి. ఆక్వా చెరువుల్లో నీటిని పంట కాలువల్లోకి యథేచ్ఛగా వదిలేస్తున్నారు. అదేనీటిని పంచాయతీ తాగునీటి ట్యాంకుల్లోకి నింపుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 40 లక్షల జనాభా ఉంది. ముఖ్యంగా డెల్టా పరిధిలోని 29 మండలాల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. డబ్బు పెట్టి కొనుగోలు చేస్తే తప్ప దాహం తీరని పరిస్థితి నెలకొంది. నెలకు కనీసంగా లెక్కించినా రూ.600కుపైగా తాగునీటి కోసం ఖర్చు చేయాల్సి వస్తోంది. 2014, 2019 ఎన్నికల్లో జిల్లాలోని తాగునీటి సమస్యనే ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా సాగింది. అయితే సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ఏ గ్రామం వెళ్లి పరిశీలించినా పంచాయతీ ట్యాంకుల నుంచి విడుదల చేస్తున్న నీరు తాగడానికి పనికిరాని పరిస్థితి. పసర్లు కమ్మి అధ్వానంగా ఉంటున్నాయి. 2019 ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే వాటర్‌గ్రిడ్ ద్వారా గోదావరి నుంచి పైపులైన్ వేసి ప్రతి గ్రామానికి తాగునీరు సరఫరా చేస్తామని వైసిపి ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన కొత్తలో హడావుడి చేసింది. వాటర్‌గ్రిడ్‌కు రూ.3,200 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. తర్వాత వాటర్‌గ్రిడ్ పథకాన్ని డెల్టాకు మాత్రమే పరిమితం చేస్తున్నట్లు ప్రకటించి రూ.1400 కోట్లకు బడ్జెట్‌ను కుదించింది. అయినప్పటికీ ఐదేళ్ల పదవీకాలంలో వాటర్‌గ్రిడ్ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో జిల్లాలోని తాగునీటి సమస్య ఇప్పటికీ అలానే ఉండిపోయింది. ఎన్నికల ముందు ప్రతి పార్టీ తాగునీటిపై హామీలు గుప్పించడం, అధికారంలోకి వచ్చాక పట్టించుకోకుండా వదిలేయడం పరిపాటిగా మారిపోయింది. జిల్లాప్రజానీకం ఎదుర్కొంటున్న ప్రధానమైన తాగునీటి సమస్యను కూడా పాలకులు పట్టించుకోకపోవడం ఇక్కడి ప్రజలకు ఆగ్రహం తెప్పిస్తోంది. వైసిపి ఓటమిలో ఈ అంశం కూడా ప్రధానమైందని చెప్పొచ్చు.

కలుషిత నీటితో అనారోగ్యం పాలు

జిల్లాలో అత్యధికంగా దిగువ మధ్యతరగతి ప్రజానీకం ఉన్నారు. ఏరోజు పనికి వెళ్తే ఆ రోజే కడుపు నిండే కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ప్రతిరోజూ రూ.30 వెచ్చించి తాగునీరు కొనుగోలు చేయలేక కలుషిత నీటినే తాగుతున్నారు. దీంతో అనారోగ్యం పాలై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలో కిడ్నీ సమస్యలు, కేన్సర్ వంటి రోగాలు ఎక్కువగా రావడానికి కలుషిత తాగునీరే కారణమనే చర్చ నడుస్తోంది. ఇంకా అనేక రోగాలు జిల్లా ప్రజలను చుట్టుముడుతున్న పరిస్థితి ఉంది. కొత్త ప్రభుత్వమైనా తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

బాలలకు స్వేచ్ఛ, వికాసం కల్పించాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన మనందరి బాధ్యత అని, బాలలకు స్వేచ్ఛ, వికాసం కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆయా శాఖల అధికారులను సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కెరెడి.బుల్లికృష్ణ, జెజె బోర్డు ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ బి.రచన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా ప్రధానంగా పాఠశాలల్లో విద్యార్థుల డ్రాప్‌అవుట్స్‌పై దృష్టి సారించాలన్నారు. ఇటుకల పరిశ్రమ, జీడి పరిశ్రమ, చిన్న తరహా పరిశ్రమలు, చిన్న దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి బాలకార్మికులను గుర్తించాలన్నారు. పొగాకు పనుల్లో కూడా ప్రధానంగా చింతలపూడి, లింగపాలెం తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. పిల్లలచే భిక్షాటన చేయించడం కూడా బాలకార్మికుల కిందే పరిగణించబడుతుందని, ఈ చర్యలను నిరోధించేందుకు కూడా పెద్దఎత్తున దృష్టి పెట్టాలని అన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నట్లు అనుమానాస్పదంగా గుర్తిస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభ అనంతరం ఏ పిల్లలైనా పాఠశాలలకు తిరిగిరాకపోతే వారి ఆచూకీ తెలుసుకుని తిరిగి పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలన్నారు. జిల్లాలో చైల్డ్‌లేబర్ విజిలెన్స్ గ్రూపును ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. రాజకీయేతర, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఈ గ్రూపును ఏర్పాటు చేసి వారి నుండి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలన్నారు. జంగారెడ్డిగూడెం, లింగపాలెం, చింతలపూడి, పెదవేగి ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ గెలలు తీసేందుకు వచ్చే వలస కుటుంబాలకు చెందిన పిల్లలకు వారి భాషలో విద్యాభోదన అందించేందుకు డిఇఒ, ఎస్ఎస్ఎ పిఒలు ప్రత్యేక పాఠశాల సౌకర్యం కల్పించాలన్నారు. ఆదివారం పూట చేపల మార్కెట్‌లో కూడా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్యవివాహాల నిర్మూలనకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చేస్తున్న సేవలను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఏలూరు పవర్‌పేట ప్రాంతంలో మేదర కాలనీల్లో కార్మికశాఖ, విద్యా, పోలీస్ బృందం పర్యటించి బాలకార్మికులకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలకు రాని బాలికలను గుర్తించి వారి సమాచారాన్ని వాకబు చేసి ఒకవేళ అటువంటి వారికి బాల్యవివాహాలు చేసినట్లు గుర్తిస్తే ఆయా తల్లిదండ్రులపై కేసులను నమోదు చేయాలన్నారు. పాఠశాలల పరిధిలో గుట్కా, పాన్ పరాగ్, గంజాయి వంటివి విక్రయించకుండా ఉక్కు పాదం మోపాలని, వాటిని విక్రయించే దుకాణాలను తొలగించాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కెరెడి.బుల్లికృష్ణ మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలనకు ప్రయత్నమే మన ముందున్న కర్తవ్యమన్నారు. జెజె బోర్డు ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ బి.రచన మాట్లాడుతూ పని చేసే పిల్లల సమస్యలను భిన్న కోణాల నుంచి అధ్యయనం చేయాలన్నారు. సమావేశంలో కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాస్, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, ఐసిడిఎస్ పీడీ కె.పద్మావతి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాధరావు, డిఇఒ కె.అబ్రహాం, సోషల్ వెల్ఫేర్ జెడి జయప్రకాష్, డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ట, సమగ్ర శిక్షాభియాన్ ఎపిసి బి.సోమశేఖర్, మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, కమిటీ సభ్యులు కట్టా సత్యనారాయణ, కూన కృష్ణారావు, బి.చంద్రశేఖర్, పి.వెంకటేశ్వరరావు, డిసిపిఒ సూర్యచక్రవేణి, సిఐ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అండగా మిషన్ వాత్సల్య


మిషన్ వాత్సల్య పథకం అమలుకు మరింత సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో శుక్రవారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి మొదటి త్రైమాసిక సమావేశాన్ని వివిధ శాఖల అధికారులతో జిల్లా బాలల సంక్షేమ, రక్షణ కమిటీ ఛైర్మన్, కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరాదారణకు గురైన బాలలకు విద్య, ఆరోగ్యం, అభివృద్ధి వంటి అవసరాలకు వాత్సల్య పథకం కింద ఆర్థిక సహాయం అందిస్తారన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి బిడ్డకూ ఆరోగ్యకర, సంతోషకర బాల్యాన్ని అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు.

ప్రమాణ స్వీకారానికి ముందే ప్రతీకారేచ్ఛ..!

ఆగమేఘాలపై వైసిపి నేత చికెన్ దుకాణం తొలగింపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎన్నికల ఫలితాలు విడుదలయ్యాయి. ఇంకా విజేతలు ప్రమాణ స్వీకారం చేయకముందే ఏలూరులో పగలు, ప్రతీకారాలు మొదలయ్యాయా అంటే జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే అవుననే సమాధానం వస్తోంది. ఈ నెల నాల్గో తేదీన ఎన్నికల ఫలితాలు వచ్చి ఆరో తేదీ సాయంత్రం అంటే 48 గంటల్లోపే స్థానిక అశోక్ నగర్‌లోని వైసిపి డివిజన్ ఇన్‌ఛార్జికి చెందిన చికెన్ షాపును అధికారులు తొలగించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. అశోక్‌నగర్ వంతెన సమీపంలోని అశోకవర్ధన మున్సిపల్ పాఠశాల ప్రహరీని ఆనుకుని 18 దుకాణాలు నడుస్తున్నాయి. ఆ ప్రాంతమంతా గతంలో కార్పొరేటర్‌గా పని చేసి మృతి చెందిన నాయుడు పోతురాజు కన్నుసన్నల్లో ఉండేది. ఎవరైనా అక్కడ కొత్తగా బడ్డీ పెట్టుకోవాలన్నా ఆయన అనుమతి తీసుకోవాల్సి వచ్చేది. 2019లో వైసిపి అధికారంలోకొచ్చాక 31, 32 డివిజన్ల వైసిపి ఇన్‌ఛార్జి షేక్ సత్తార్ అక్కడున్న స్థలంలో ఒక బడ్డీ ఏర్పాటు చేసుకుని అలంకార్ చికెన్ పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఇన్ని సంవత్సరాలుగా బాగానే సాగిన ఆయన వ్యాపారం గురువారం సాయంత్రంతో ముగిసింది. గురువారం సాయంత్రం మున్సిపల్ అధికారులు జెసిబితో బడ్డీ కూల్చివేతకు ఉపక్రమించారు. రెండు లక్షల రూపాయలకుపైగా ఖర్చు చేసి ఏర్పాటు చేసుకున్న బడ్డీ అని, నాలుగు రోజులు సమయం ఇస్తే తానే తొలగిస్తానని అధికారులకు చెప్పినా వినలేదు. కమిషనర్ ఆదేశాలు అంటూ బడ్డీని అక్కడ నుంచి తొలగించారు. కారణమడిగితే రోడ్డు వెడల్పు చేస్తున్నామని చెప్పారు. దీంతో చేసేదేమీ లేక సత్తార్ మౌనంగా ఉండిపోయారు. ఆ పక్కనే మరో 17 దుకాణాలు ఉన్నప్పటికీ వాటిని తొలగించే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం. ఆ దుకాణాదారులకు కనీసం తొలగించాలని కూడా ఎలాంటి నోటీసులూ ఇవ్వలేదు. దీంతో రాజకీయ కక్షలు మొదలయ్యాయా అనే చర్చ సర్వత్రా సాగుతోంది. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక మంచినీళ్లతోట ఏటిగట్టున ఉన్న స్థానిక తెలుగుదేశం నాయకుడికి చెందిన రెండంతస్తుల భవనాన్ని పోలీసు బందోబస్తు పెట్టి మరీ కూల్చివేశారు. తమ్మిలేరు లోపల ఉందని, అక్రమ కట్టడం అని అప్పుడు కారణాలు చెప్పారు. అలాంటి రెండంతస్తుల భవనాలు ఆ పక్కన చాలా ఉన్నప్పటికీ వేటినీ మున్సిపల్ అధికారులు తొలగించలేదు. సంవత్సరం క్రితం అశోక్ నగర్ శ్మశాన వాటికలో ఎన్నో సంవత్సరాలుగా వేలాది మృతదేహాల తరలింపు, మృతదేహాలను భద్రపర్చే ఫ్రీజర్ బాక్సులు ఉచితంగా అందిస్తున్న వాటి నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన షెడ్డు [illegible] నిర్మాణాన్ని కూల్చివేసిన ఘటన ఏలూరులో సంచలనం సృష్టించింది. ఫ్రీజర్ సంస్థ నిర్వాహకుడు అప్పటి ఎంఎల్‌ఎను సరిగా గౌరవించలేదనే కారణంతోనే ఈ తొలగింపు చేపట్టినట్టు ప్రచారం సాగింది. ఆ కూల్చివేతల పాలన ముగిసి కొత్త పాలన ఇంకా పగ్గాలు చేపట్టకముందే కూల్చివేతలు ప్రారంభం కావడం విస్మయం కల్గిస్తోంది. అధికారం శాశ్వతం అని భావించి దురహంకారంగా ప్రవర్తిస్తే పాలకులకు ప్రజలే బుద్ధి చెబుతారని ఇటీవల ఎన్నికల ఫలితాలు చెప్పకనే చెప్పాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు తమ తీరు మార్చుకుని కక్షపూరిత విధానాలకు స్వస్తి పలికి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని అంతా కోరుతున్నారు.



తొలగిస్తున్న బడ్డీ




మిగిలిన దుకాణాలు యథాతథం

డిసిసిబి మొబైల్ ఎటిఎం వ్యాన్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు

డిసిసిబి ప్రధాన కార్యాలయంలో నూతన మొబైల్ ఎటిఎం వ్యాన్‌ను ఏలూరు పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీ ఛైర్‌పర్సన్, జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులు, రైతులు, ప్రజలు ఎటిఎం వినియోగించుకోవడంతోపాటు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కోసం ఈ వ్యాన్ అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఈ వ్యాన్ సేవలు అందరూ వినియోగించుకోవాలని కోరారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రెండు వ్యాన్‌లకు అదనంగా ఈ వ్యాన్ అందుబాటులోకి తెచ్చామన్నారు. అనంతరం బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీ సమావేశం లావణ్యవేణి అధ్యక్షతన జరిగింది. సదరు సమావేశంలో బ్యాంకు ఎన్‌పిఎలను తగ్గించి బ్యాంకును లాభాల బాటలోకి తీసుకొచ్చేందకు కృషి చేయాలని నిర్ణయించారు. సమావేశంలో సిఇఒ డాక్టర్ బి.శ్రీదేవి, నాబార్డు డిడిఎం టి.అనిల్‌కాంత్, బ్యాంకు సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మొబైల్ ఎటిఎంను ప్రారంభిస్తున్న జెసి లావణ్యవేణి

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఎస్‌పి మేరీప్రశాంతి

ప్రజాశక్తి - కామవరపుకోట

ఎన్నికల ముగియటంతో గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి మేరీ ప్రశాంతి అన్నారు. జంగారెడ్డిగూడెం డిఎస్‌పి కార్యాలయంలో దస్త్రాలు తనిఖీల్లో భాగంగా మండల కేంద్రమైన స్థానిక కొత్తూరు బస్టాండ్ ఎదురుగా గ్రామస్తులతో మాట్లాడారు. ఎన్నికలు, కౌంటింగ్ ప్రక్రియ చాలా ప్రశాంత వాతావరణంలో జరిగాయన్నారు. సహకరించిన అన్ని సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామాల్లో రెచ్చగొట్టే విధంగా మాట్లాడినా, సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేసినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అవసరమైతే అటువంటి వారిపై రౌడీ షీట్లు తెరుస్తామన్నారు. అనుమానిత గ్రామాల్లో పికెట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచనలు ఇచ్చారు. ఆమెతో పాటు జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర, సిఐ పి.రాజేష్, తడికలపూడి ఎస్ఐ జయబాబు ఉన్నారు.



పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్‌పి మేరీప్రశాంతి

హోంగార్డుల సంక్షేమానికి కృషి

ఎస్‌పి మేరీప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

హోంగార్డుల సంక్షేమానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామని ఎస్‌పి మేరీ ప్రశాంతి చెప్పారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉద్యోగ విరమణ చేస్తున్న హోంగార్డుకు సన్మాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మేరీప్రశాంతి ఉద్యోగ విరమణ చేస్తున్న హోంగార్డు కృష్ణగణేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన కృష్ణగణేష్ విశ్రాంత ఉద్యోగిగా మిగిలిన సమయాన్ని కుటుంబ సభ్యులతో గడపలని ఆమె కోరారు. హోంగార్డుల సంక్షేమానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. నెలలో ఒకసారి గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సమస్యలను తెలుసుకుంటున్నామని చెప్పారు. ఎవరికైనా ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు.

మలేరియా జ్వరాల పట్ల అప్రమత్తత అవసరం

అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి గోవిందరావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మలేరియా జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో వైద్య చికిత్స తీసుకోకపోతే ప్రాణాపాయమని అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక ఏలూరు గవరవరం చెరువుగట్టు ప్రాంత ప్రజలకు మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జె.గోవిందరావు మాట్లాడుతూ ఎక్కువగా హాని చేసే మలేరియా కారక దోమ అనాఫిలస్, డెంగీ కారక దోమ ఎడిస్ గృహాల్లో ఉండే మంచి నీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయని తెలిపారు. మలేరియా ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో ఉన్నప్పటికీ అక్కడక్కడా పట్టణ ప్రాంతాల్లో కూడా విస్తరించే అవకాశం ఉందని తెలిపారు. జ్వరం, చలి, వణుకు, చెమట పట్టడం వంటి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా సమీప ఆరోగ్యకేంద్రాలు, హెల్త్, వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించాలని చెప్పారు. మలేరియా, డెంగీ పరీక్షలు ఉచితంగా చేస్తామని, ప్రభుత్వ సేవలు ఉపయోగించుకోవాలని కోరారు. మలేరియా నిర్మూలనలో ప్రజలు భాగస్వామ్యం కలిగి, ఇంట్లో, ఇంటి పరసరాల్లో ఉండే నీటి నిల్వ ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త జి.నాగమణి, హెల్త్ అసిస్టెంట్స్ మేకా శ్రీనివాసరావు, సిహెచ్.రమేష్, అయ్యప్ప, ఆశా కార్యకర్తలు కె.శాంతి, వసంత పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు విజయవంతం

ముగింపు కార్యక్రమాల్లో వక్తలు

విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం



ఏలూరు బాలల గ్రంథాలయంలో....

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక బాలల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు కార్యక్రమం, విద్యార్థులకు సర్టిఫికెట్స్ బహుమతి ప్రదాన కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ పిఎస్.లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యతోపాటు తమకు ఇష్టమైన రంగంలో విద్యార్థులు ప్రతిభ కనబరచాలని తెలిపారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం సెక్రటరీ గుడిపాటి నరసింహరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ గ్రంథాలయాలను వినియోగించుకోవాలని, మంచి పౌరులుగా సమాజానికి ఉపయోగపడాలని తెలిపారు. ముఖ్య అతిథుల చేతులమీదుగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం, సర్టిఫికెట్స్ అందించారు. దాదాపు 20 రోజులుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో పాల్గొని తమ సేవలందించిన రిసోర్స్ పర్సన్లకు గ్రంథాలయ నిర్వాహకురాలు ఎం.శోభ కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఆదివారం జరిగే విలవ్ రీడింగ్ ప్రోగ్రాంలో విద్యార్థులు పాల్గొనాలని, గ్రంథాలయంలో సభ్యులుగా చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నై వెంకట్రామయ్య, బాలల గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, జి.గంగాభవాని, ఇఆర్‌డిజికె స్కూల్ మ్యూజిక్ టీచర్, రిసోర్స్ పర్సన్స్ టి.నళిని, శారద, జి.ఉషశ్రీ, జి.పవన్‌కుమార్, శ్రావణికుమారి, ఎం.కీర్తి పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ ముగింపు సభకు ముఖ్య అతిథిగా పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ చీర్ల పద్మశ్రీ అధ్యక్షత వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు సభను ప్రారంభించి మాట్లాడారు. వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరానికి క్రమం తప్పకుండా హాజరైన చిన్నారులను, వారి తల్లితండ్రులను అభినందించారు. చిన్నారులు శిబిరం ముగిసిన తర్వాత కూడా గ్రంథాలయానికి వచ్చే అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి గ్రంథాలయ సభ్యత్వం పొందాలన్నారు. చైర్‌పర్సన్ చీర్ల పద్మశ్రీ మాట్లాడుతూ చిన్నారులకు, శిక్షణ అందించిన రిసోర్స్‌పర్సన్లను అభినందించారు. శిబిరానికి క్రమం తప్పకుండా హాజరైన విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు, బహుమతులు చైర్‌పర్సన్ చేతుల మీదుగా అందించారు. రిసోర్స్‌పర్సన్లను మెమోంటోస్‌తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు : ఎంఇఒ టి.రామ్మూర్తి

టి.నరసాపురం : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని ఎంఇఒ టి.రామ్మూర్తి అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామ్మూర్తి మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. చరిత్రలో ఎంతోమంది పుస్తకాలను చదివి ఉన్నత శిఖరాలను చేరుకున్నారని గుర్తు చేశారు. మండల వైద్యాధికారిణి జె.కల్పనారాణి మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా పుస్తక పఠనం ద్వారా విజ్ఞాన సముపార్జించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో విజన్ యుపి స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్యాలను చేరుకున్నాం

భీమడోలు : శాఖా గ్రంథాలయాలు బాలల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు విజయవంతమయ్యాయని, యాజమాన్యం ఆశించిన లక్ష్యాలను చేరుకున్నాయని పలువురు వక్తలు తెలిపారు. గుండుగొలను శాఖ గ్రంథాలయంలో గ్రంథ పాలకులు జి.నాగమణి ఆధ్వర్యంలో మే 15వ తేదీ నుంచి శుక్రవారం వరకు నిర్వహించిన శిబిరం శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి తిరుమలం పాలెం హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకప్పుడు గ్రంథాలయాలు కొన్ని సేవలకు మాత్రమే పరిమితమయ్యేవన్నారు. యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ వహించి చేపట్టిన కార్యక్రమాల ద్వారా అవసరమైన సమాచారాలను అందించే కేంద్రాలుగా మారాయన్నారు. తాజాగా నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం తరగతులు బాలలకు అవసరమైన సమాచారాన్ని అందించడంతో పాటు, వారి భవిష్యత్తుకు అవసరమైన వివిధ అంశాలను నేర్పాయన్నారు. ఈ క్రమంలో బాలలు సైతం గ్రంథాలయాలకు నిత్య సందర్శకులుగా మారారని కితాబునిచ్చారు. అనంతరం శిక్షణా తరగతుల నిర్వహణ సందర్భంగా వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందించారు.

కలిదిండి : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించినట్లు శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు తెలిపారు. మే 15వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ శిబిరంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రతిఒక్కరూ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని వక్తలు అన్నారు.

ధాన్యం బకాయి సొమ్ములు చెల్లించకపోతే ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతులకు, కౌలు రైతులకు ధాన్యం బకాయి సొమ్ములు చెల్లించకపోతే ఈ నెల పదో తేదీన ఏలూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడతామని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ హెచ్చరించారు. ఏలూరు శివారు సుంకరివారితోటలో శుక్రవారం నిర్వహించిన ధాన్యం బకాయి సొమ్ములు రావాల్సిన బాధిత రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు, కౌలు రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మి 40 రోజులు దాటిపోతున్నా ధాన్యం బకాయి సొమ్ములు చెల్లించకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రబీ సాగుకు చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయన్నారు. మరోవైపు ఖరీఫ్ సాగు ముందుకు రావడంతో విత్తనాల కొనుగోలుకు సైతం పెట్టుబడి లేక అల్లాడిపోతున్నారని చెప్పారు. ఏలూరు జిల్లా పరిధిలో దాదాపు రూ.200 కోట్ల ధాన్యం బకాయి సొమ్ములు రైతులకు చెల్లించాల్సి ఉందన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించకపోతే అన్నదాతల సమస్యలు తీవ్రమవుతాయని చెప్పారు. అధికార యంత్రాంగం వెంటనే స్పందించి ధాన్యం బకాయి సొమ్ములు చెల్లించి అన్నదాతలను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బైరెడ్డి లక్ష్మణరావు, చిన్ని పోతురాజు, అన్నంరెడ్డి రంగారావు, పల్లెల వరహాలరావు, ఎన్.నాగరాజు, ధర్మవరపు రాము పాల్గొన్నారు.

సిపిఎం నేత నాగేశ్వరరావుకు సతీ వియోగం

ప్రజాశక్తి - ముసునూరు

నూజివీడుకు చెందిన సిపిఎం నేత నందిగం నాగేశ్వరరావు సతీమణి నందిగం అరుణ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని సిపిఎం నాయకులు వై.కేశవరావు, జి.విమలమ్మ, పావన్, జి.రాజు, దుర్గారావు, హనుమాన్, ఎకెడి.ప్రసాద్ సందర్శించి నివాళులర్పించారు.

ఎన్ఎంఎంఎస్‌కు 9 మంది ఎంపిక

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండలం నుంచి జాతీయ ప్రతిభా అన్వేషణ పురస్కార ఉపకార వేతనాలకు తొమ్మిది మంది విద్యార్థులు అర్హత సాధించారని విద్యాధికారులు శ్రీనివాసరావు, భాస్కరకుమార్ తెలిపారు. దీనిలో భాగంగా అత్యధికంగా పూళ్ల హైస్కూల్‌కు చెందిన నలుగురు, గుండుగొలనుకు చెందిన ముగ్గురు, భీమడోలు, ఆగడాలలంకల నుంచి ఒకొక్కరు వంతున ఎంపికయ్యారన్నారు. వీరికి సంవత్సరానికి రూ.12 వేల వంతున మంజూరైన ఉపకార వేతనాలు వారి బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయన్నారు.

అందరూ విధిగా మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటి అవి పెరిగి చెట్లు అయ్యేలా ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని నారాయణపురం సర్పంచి దిడ్ల అలకనంద అన్నారు. నారాయణపురం ప్రభుత్వ కాలేజీ ప్రాంగణంలో శుక్రవారం కొబ్బరి మొక్కలను నాటారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పనుల్లో వర్షాకాలంలో ప్రతి గ్రామానికి 50 కొబ్బరి, నేరేడు తదితర మొక్కలను నాటించనున్నామని ఎపిఒ మల్లేశ్వరరావు తెలిపారు. ఇవి కాకుండా ప్రభుత్వ భూములు, కాలువ, ఇరిగేషన్ స్థలాలు, గట్లు, పుంత దారుల వెంబడి నీడ నిచ్చే మొక్కల పెంపకానికి ప్రతిపాదనలు గతంలోనే పంపించామని ఎపిఒ తెలిపారు.

రెడ్డి అప్పలనాయుడుకు ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడును నాయకులు, కార్యకర్తలు శుక్రవారం సత్కరించారు. స్థానిక పవర్‌పేటలోని జనసేన పార్టీ కార్యాలయంలో పలువురు, చెంచుల కాలనీలోని ఆయన స్వగృహంలో పలువురు రెడ్డి అప్పలనాయుడును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు ఎంతో క్రమశిక్షణతో పార్టీ కోసం అంకితభావంతో పనిచేశారన్నారు.

కార్పొరేషన్ రుణాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్ రుణాలు ఇవ్వాలని కెవిపిఎస్ జిల్లా కమిటీ కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2019లో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఎస్‌సి కార్పొరేషన్ రుణాలను మంజూరు చేసిందన్నారు. ఎన్నికల సమయం కావడంతో కోడ్ ఉందని మంజూరైన రుణాన్ని ఆపేశారన్నారు. తర్వాత అధికారంలోకొచ్చిన వైసిపి పెండింగ్ రుణాలు ఆపేసిందని చెప్పారు. ఈ నెల 12వ తేదీన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న చంద్రబాబు కార్పొరేషన్ రుణాలను, పెండింగ్ రుణాలు విడుదల చేయాలని కోరారు. వైసిపి ప్రభుత్వం గత ఐదేళ్లుగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి కార్పొరేషన్ రుణాలను నిర్లక్ష్యం చేసిందన్నారు. అదే పద్ధతిలో టిడిపి కూటమి ప్రభుత్వం పోకుండా ఎస్‌సి, ఎస్‌టిల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు.

కూటమిని గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు

మాజీ ఎంఎల్ఎ మురళీరామకృష్ణ

ప్రజాశక్తి - కామవరపుకోట

రాష్ట్రంలో టిడిపి కూటమిని గెలిపించిన ప్రజలకు చింతలపూడి మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీరామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల ముఖ్య నేతలతో తడికలపూడిలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సొంగా రోషన్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేసేందుకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మురళీరామకృష్ణ మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఐదేళ్లుగా మొక్కవోని ధైర్యంతో నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేశారన్నారు. జనసేన, బిజెపి శ్రేణుల మద్దతుతో చింతలపూడి లో టిడిపి ఇంతటి ఘన విజయాన్ని సాధించిందని మురళీ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు తూతా లక్ష్మణరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు బొంతు వెంకటేశ్వరరావు, జుజ్జూరి బాబ్జి, మెరుగు సుందరరావు, బొప్పన అంజయ్య, యాలమర్తి రాంబాబు పాల్గొన్నారు.

కైకలూరును అభివృద్ధి పథంలో నడిపించాలి

ప్రజాశక్తి - మండవల్లి

కైకలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించే విధంగా ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్‌తో కలిసి చర్యలు చేపట్టాలని చాపరాల దుర్గాప్రసాద్, సజ్జ బాబిలను డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జిఎంసి బాలయోగి భవన నిర్మాణ కమిటీ అధ్యక్షులు దానం ప్రసాద్ కోరారు. కామినేని శ్రీనివాస్ గెలుపునకు ముఖ్య భూమిక పోషించిన మండవల్లి మండలంలోని భైరవపట్నానికి చెందిన ఆయన శుక్రవారం ప్రత్తిపాడు స్టేజి వద్ద ఉన్న కార్యాలయంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గం అభివృద్ధిలో కుంటు పడిపోయిందన్నారు. సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కైకలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

చిర్రి బాలరాజును కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండల కేంద్రమైన ద్వారకాతిరుమల గ్రామానికి చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు, జన సైనికులు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాలరాజు కలిసినవారిలో ద్వారకాతిరుమల జనసైనికులు తరగళ్ల శ్రీను, కోట అంజిబాబు, బండారు నాగబాబు, చిలుకూరు ఫణి, అంబటి రాజేష్ ఉన్నారు.

ఈ విజయం ప్రజలందరిది : చింతమనేని

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఇది తన ఒక్కడి విజయం మాత్రమే కాదని, తన గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన ప్రతి ఒక్కరీ విజయమని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఆయనకు అభిమానులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. దెందులూరు సహా ఏలూరు జిల్లాలోని పలు నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వస్తుండటంతో అక్కడ అల్పాహారం, భోజనం ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. శుభాకాంక్షలు తెలుపటానికి వచ్చిన ప్రజలందరికీ చింతమనేని ప్రభాకర్ కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు అయిపోయాయని, రాజకీయాలు పక్కనపెట్టి అభివృద్ధిపై దృష్టి పెటాలని అక్కడికు వచ్చిన పంచాయతీ సర్పంచులు, ఎంపిటిసిలకు సూచించారు.

సాధారణ ఎన్నికల ఫలితాలపై హర్షం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

సాధారణ ఎన్నికల ఫలితాలపై భారత్ ఆదివాసీ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. బుట్టాయగూడెంలో భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోదెం ముక్కయ్య ఇంటి వద్ద పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు తెల్లం రవిప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బిఎపి పోలవరం ఎంఎల్ఎ అభ్యర్థి మొడియం శ్రీనివాసరావు మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో భారత్ ఆదివాసీ పార్టీ నుంచి రాజస్థాన్ రాష్ట్రం బన్స్ వారా లోక్ సభ స్థానం నుంచి రాజ్‌కుమార్‌రోత్ 2,47,054 ఓట్ల మెజారిటీతో గెలుపొందారన్నారు. అదే పార్లమెంట్ పరిధిలో బాగిదొర అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో బిఎపి అభ్యర్థి జైకృష్ణ పటేల్ గెలుపొందారని తెలిపారు. ఆదివాసీ ఎంఎల్ఎలందరూ ఆదివాసీల చట్టాలను, హక్కులను కాపాడటానికి కృషి చేయాలని కోరారు..

మద్దిపాటి వెంకటరాజు విజయోత్సవ ర్యాలీ

ద్వారకాతిరుమల :గోపాలపురం నియోజకవర్గ ఎంఎల్ఎగా ఎన్నికైన మద్దిపాటి వెంకటరాజు విజయోత్సవ ర్యాలీ ద్వారకాతిరుమల మండలం గ్రామాల గుండా టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులు శుక్రవారం నిర్వహించారు. మొదట మద్దిపాటి వెంకటరాజు శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పంగిడిగూడెం నుంచి విజయోత్సవ ర్యాలీ ప్రారంభమై ఎం.నాగులపల్లివరకు సాగింది.

ఉన్నత విలువలతో ఒత్తిడి లేని విద్య ఎన్ఆర్ఐ సొంతం


కళాశాల సిఇఒ వి.తులసీరామ్



రవీంద్ర



రాజేంద్రప్రసాద్



తులసీరామ్



ఎన్ఆర్ఐ విద్యాసంస్థలు

ప్రజాశక్తి - ఏలూరు

ఒత్తిడి లేకుండా విషయ పరిజ్ఞానంతో ఉన్నత విలువలతో కూడిన విద్య ఏలూరు ఎన్ఆర్ఐ కళాశాల సొంతమని ఆ కాలేజీ సిఇఒ వి.తులసీరామ్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. నాలుగు దశాబ్దాల క్రితమే గుంటూరు మెడికల్ కళాశాలలో మెడిసిన్ పూర్తి చేసి, అమెరికా దేశంలోని క్యాలిఫోర్నియాలో ప్రముఖ వైద్యుల్లో ఒకరిగా ఉంటూ భారతదేశ కీర్తిని అమెరికాలో చాటి చెప్పిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలాజిస్ట్ ఆలపాటి రవీంద్ర 2002లో గుంటూరు జిల్లా మంగళగిరి వద్ద అత్యున్నత ప్రమాణాలతో వసతులతో ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ స్థాపించారన్నారు. కాలేజీ, హాస్పిటల్‌కు డైరెక్టర్‌గా సేవలందిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అతి నిరుపేద విద్యార్థుల కోసం సొసైటీ ఫర్ రూరల్ స్కాలర్స్ అనే ఛారిటీ సంస్థను స్థాపించారన్నారు. ఎంతోమంది విద్యార్థులను ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు ఉచితంగా చదివిస్తూ వారి జీవితాలను అపురూపంగా తీర్చిదిద్దే క్రమంలో 2008లో ఎన్ఆర్ఐ అకాడమీని ప్రారంభించి ఒత్తిడిలేని విద్య అందిస్తున్నట్లు చెప్పారు. ర్యాంకులు, మార్కులే పరమావధిగా కాకుండా విషయ పరిజ్ఞానం, ఉత్తమ విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసే విధానంలో శిక్షణ ఇస్తూ ఉన్నత విలువలతో కూడిన విద్య అందిస్తున్నట్లు చెప్పారు. ఉన్నత భావాలు కలిగిన అధ్యాపకులను గౌరవిస్తూ అతి తక్కువ కాలంలోనే తెలుగు ప్రజల అభిమానాన్ని ఆలపాటి రవీంద్ర చురగొన్నారన్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్ అంటే తెలుగు రాష్ట్రాల్లో తెలియని వారుండరన్నారు. ఆయనను అందరూ రాజా అని పిలుస్తారన్నారు. గుంటూరు జిల్లాలో తన విద్యాభ్యాసం డిగ్రీ వరకు పూర్తి చేసి, తర్వాత ఉమ్మడి పశ్చిమగోదారి జిల్లా ఏలూరులో సిఆర్.రెడ్డి కళాశాలలో న్యాయవాద విద్య (ఎల్ఎల్‌బి) 1985లో పూర్తి చేశారన్నారు. అనంతరం హైదరాబాద్ హైకోర్టులో న్యాయవాదిగా పేద ప్రజల కోసం ఎన్నో కేసులు వాదిస్తూ ప్రజాసేవ చేస్తూ సమయంలో అప్పటి సిఎం నందమూరి తారకరామారావు దృష్టికి ఆకర్షించి ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి ఆహ్వానం అందుకుని గుంటూరు జిల్లా వేమూరు, తెనాలి నియోజకవర్గాల్లో శాసన సభ్యునిగా మూడు సార్లు ఎన్నికయ్యారన్నారు. 1995లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు మంత్రివర్గంలో సాంకేతిక విద్యా శాఖ మంత్రిగా పని చేసి అందరి మన్ననలు పొందారన్నారు. ప్రజాసేవయే పరమావధిగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు వ్యాపార ధోరణిలో కాకుండా ఒత్తిడి లేని నాణ్యమైన విద్య అందించాలనే దృఢ సంకల్పంతో కేవలం వెయ్యి మంది విద్యార్థులతో 2008లో గుంటూరులో ఎన్ఆర్ఐ అకాడమీ అనే విద్యాసంస్థను ప్రారంభించారన్నారు. దినాదినాభివృద్ధి చెందుతూ తెలుగు రాష్ట్రాల్లో గుంటూరుతో పాటు విజయవాడ, విశాఖపట్నం, ఏలూరు, హైదరాబాద్, శ్రీకాకుళం, విజయనగరం, తిరుపతి, తెనాలి, చెరుకుపల్లి, ఒంగోలు, నెల్లూరు, అనంతపురం, కడప పట్టణాలకు విస్తరించి ఇప్పుడు సుమారు లక్షమంది విద్యార్థులతో విరాజిల్లుతుందన్నారు. అందరి ఆశీస్సులతో మరికొన్ని పట్టణాలకు విస్తరిస్తూ ఎన్ఆర్ఐ విద్యాసంస్థ విజయ పథాన దూసుకుపోతుందని తెలిపారు.


ఎక్కడపడితే అక్కడే చెత్తాచెదారం..!

దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు

నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కామవరపుకోట



నిరుపయోగంగా మారిని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

చెత్త నుంచి సంపద సృష్టించాలనే ధ్యేయంతో రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన డంపింగ్ యార్డులు, వాటికి అనుసంధానంగా కొనుగోలు చేసిన గ్రీన్ వెహికల్స్ ఉపయోగించకపోవడంతో గ్రామాల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. మండలంలోని రావికంపాడు గ్రామ పంచాయతీలో ఎక్కడ చూసినా చెత్తా చెదరంతో రోడ్లన్నీ అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన డంపింగ్ యార్డ్ ఉన్నా కూడా చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకపోవడం వల్ల చెత్తా చెదారం అంతా ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. దీంతో ఆ పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతుంది. గ్రామంలో ఉన్న చెత్త అంతటినీ సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని, రానున్న వర్షాకాలంలో కూడా ఈ చెత్త అంతా ఈ రోడ్ల మీద పేరుకుపోయి ఉంటే వివిధ రకాల వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయాందోలనకు గురవు తున్నారు. డంపింగ్ యార్డుకు వెళ్లే సముద్రకుంట చెరువు గట్టు నిండా చెత్తాచెదారంతో నిండిపోయింది. వర్షాలు పడితే ఈ చెత్త అంత వెళ్లి చెరువులో కలవడం వల్ల ఆ చెరువులోని నీరు అంత విషపూరితమయ్యే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. డంపింగ్ యార్డు దగ్గరకు తీసుకెళ్లిన చెత్తను కూడా డంపింగ్ యార్డులో వేయకుండా పక్కన ఉన్న శ్మశానవాటికలో వేస్తున్నారని, దీంతో గ్రామంలో ఎవరైన మరణించినప్పుడు అంత్యక్రియల సమయంలో చెడు వాసనతో అంత్యక్రియలు చేయడానికి స్థలం సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలి

కుక్కునూరు :ప్రజలకు ప్రతి ఒక్క టిడిపి కార్యకర్త అందుబాటులో ఉండి సమస్యలు పట్టించుకోవాలని, సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులందరికీ అందేలా చూడాలని టిడిపి మండల సీనియర్ నాయకులు ముప్పాళ్ల సాంబశివరావు చెప్పారు. సీతారామనగరంలో టిడిపి నాయకులు తాతా వంశీ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి సాంబశివరావు హాజరయ్యారు. ముందుగా స్థానిక సర్పంచి శ్రీదేవి పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సాంబశివరావు మాట్లాడుతూ టిడిపి కూటమి అధికారంలోకి రావటానికి కష్టపడిన కార్యకర్తలందరికి ధన్యవాదాలు తెలిపారు.

ఏలూరును అభివృద్ధి పథంలో నడుపుతా

ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



మాట్లాడుతున్న బడేటి చంటి

ఐకమత్యం, నిజాయితీ, చిత్తశుద్ధితో టిడిపి అభ్యర్థిగా తన గెలుపు కోసం సైనికుల్లా పనిచేసిన ప్రతిఒక్కరికి రుణపడి ఉంటానని ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. ప్రతిఒక్కరీ సహకారంతో ఐదేళ్ల పాటు నీతినిజాయితీతో పనిచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడుపుతానన్నారు. ఏలూరులోని టుబాకో మార్చంట్స్ కళ్యాణ మండపంలో శుక్రవారం రాత్రి టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలతో కృతజ్ఞత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ తన గెలుపు కోసం టిడిపి కూటమి కార్యకర్తలు చేసిన కృషి మరువలేనిదన్నారు. ఇదేస్ఫూర్తితో రానున్న ఐదేళ్ల పాటు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానన్నారు. కూటమి కార్యకర్తలు, నాయకులకు ప్రాధాన్యత కల్పిస్తూ వారికి అండదండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మారడని రంగారావు, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డిఅప్పలనాయుడు, టిడిపి ఏలూరు అధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్, జనసేన అధ్యక్షులు నాగిరెడ్డి కాశీనరేష్, బిజెపి అధ్యక్షులు నాగం శివ, ఏలూరు నియోజకవర్గ పరిశీలకులు మీర, టిడిపి నాయకులు ఎంఆర్‌డి.బలరాం, ఈడ మాజీ ఛైర్మన్ ఉప్పాల జగదీష్‌బాబు, దాసరి ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి చర్యలు

ఎంఎల్ఎ బడేటి చంటిని కోరిన ప్రిన్సిపల్ గిరిబాబు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి అన్ని రకాలుగా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్యను కోరారు. ప్రిన్సిపల్, సిబ్బంది నూతనంగా ఎన్నికైన ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్యను ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎంఎల్ఎను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణ మాట్లాడుతూ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వ నిధులు మంజూరు చేస్తుందన్నారు. కళాశాలకు సంబంధించిన అన్ని అంశాల గురించి త్వరలో ఒకసారి విపులంగా చర్చిద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిపిడిసి సభ్యులు ఎల్.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు వి.వెంకట్రావు, డాక్టర్ ఎం.రాంబాబు, డాక్టర్ ఎం.విజయ్‌కుమార్, ఎస్.పరమేశ, ఎం.కృష్ణచైతన్య, టివి.దుర్గాప్రసాద్, డాక్టర్ పి.కావ్యశ్రీ పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీలకు పంపించండి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ ఈదర సెక్టార్ సూపర్‌వైజర్ జి.రాగమయి కోరారు. ఈదర అంగన్వాడీ కేంద్రం-3లో మూడేళ్లు నిండిన పిల్లల తల్లులకు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాగమయి మాట్లాడుతూ మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించడం వల్ల కలిగే ప్రయోజనాలు, వసతుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం మన అంగన్వాడీ పిలుస్తుంది అనే నినాదంతో ఈదర గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి - కామవరపుకోట

ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివి ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులను సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా ప్రోత్సహించే కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఎంఇఒ-1 సుబ్బారావు అన్నారు. స్థానిక హైస్కూల్ ప్రాంగణంలో మండలంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన ప్రతిభ కలిగిన 13 మంది విద్యార్థులను గుర్తించి సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ మెంబర్-93 రామన్నపాలెం గ్రామ నివాసి చైనాలో ఉండే బోడా విజయ్ ఆర్థిక సహాయం ద్వారా ప్రశంసాపత్రం, పారితోషకం, జ్ఞాపిక అందించడం విద్య పట్ల ఉన్న మక్కువను తెలియజేస్తుందన్నారు. ఎంఇఒ-2 ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే సౌకర్యాలను వినియోగించుకుని విద్యార్థులు బంగారు భవితకు బాటలు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రావికంపాడు ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు, ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, పోరంకి నాగరాజు, శివప్రసాద్, కిషోర్, ఎస్.ప్రసాద్, ఎం.సుబ్బారావు, సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు వీరమల్ల మధు, మున్నంగి శ్రీనివాస్ (కరివేపాకు), గోరీకల వెంకట్, సౌజన్ సాయి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విశాలాంధ్ర విలేకరి మృతి

కామవరపుకోట :విశాలాంధ్ర కామవరపుకోట మండల విలేకరి టి.రామకృష్ణ(40) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. గురువారం ఆయన అస్వస్థతకు గురవ్వడంతో వైద్య నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్ర వారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన రెండు దశాబ్దాలుగా విశాలాంధ్ర విలేకరిగా పని చేస్తున్నారు. ఆయనకి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

'టిడిపి కూటమిది చారిత్రాత్మక విజయం'

ఏలూరు అర్బన్ :రాష్ట్రంలో టిడిపి కూటమి చారిత్రాత్మక విజయం సాధించడం అభినందనీయమని రాష్ట్ర రజక సంఘ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘ అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. ఏలూరులోని రజక జన సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సంఘ నాయకుల సమావేశంలో రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు.